## క్లుప్తంగా

### నేడు ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటన

మదనపల్లె : వైఎస్సార్ సీపీ లోక్‌సభపక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డిమిథున్‌రెడ్డి శనివారం వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా మహిళలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ కార్యాలయం శుక్రవారం ప్రకటనలో తెలిపింది. పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో ఉదయం 11 గంటలకు, మండలంలోని కొత్తపల్లె హంద్రీనీవా కాలువ దగ్గర మధ్యాహ్నం 3గంటలకు జరిగే వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.

### పోలీసుస్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

మదనపల్లె: ఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్ ప్రశ్నపత్రాలు మదనపల్లె పోలీసు స్టేషన్‌కు చేరాయి. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నుంచి అధికారులు పోలీసుస్టేషన్‌కు తరలించారు. పరీక్షల అధికారులు ప్రశ్నపత్రాలను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌లో భద్రపరిచారు. బాపూజీ మున్సిపల్ హైస్కూల్ ఎగ్జామినేషన్ చీఫ్ హాషిం మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో ఓపెన్ టెన్త్ పరీక్షలకై హోప్, వివేకానంద మున్సిపల్ హైస్కూళ్లలోనూ, ఓపెన్ ఇంటర్ పరీక్షలకై బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ఎస్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి ఉదయం 9.30 నుంచి 12.30 వరకు రెగ్యులర్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు ఓపెన్ స్కూల్ , ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు.

### కవులకు కుప్పం సాహితీ పురస్కారాలు

మదనపల్లె సిటీ: సాహితి రంగంలో రాణిస్తున్న కవులకు కుప్పం సాహితీ పురస్కారాలు అందజేశారు. చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో మదనపల్లెకు చెందిన ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఏ.కృష్ణమూర్తి, డాక్టర్ కవితాశ్రీ, మోహన్‌వల్లి, రామిగాని ఉమాదేవిలకు పురస్కారాలను కుప్పం సాహితీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ రామలక్ష్మి అందజేశారు.

### దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు రూరల్ : స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన వ్యాయామ విద్య అధ్యాపకుడిగా పని చేయుటకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. ఎంపీఈడీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. సెట్, నెట్, ఎంఫిల్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

### మైక్‌సెట్ వితరణ

రామసముద్రం: చదువుకున్న పాఠశాలకు విద్యార్థులు చందాలు వేసుకుని రూ.25 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను గుర్తుగా వితరణ చేశారు. రామసముద్రం మండలం అరికెల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవం, 10వతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన అందరినీ అలంచింది. విద్యార్థులు బాగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించి చదువుకున్నపాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని హెచ్ఎం గురునాథం తెలిపారు.

### ఐదుగురు జూదరుల అరెస్టు

నిమ్మనపల్లె: పేకాట స్థావరాలపై దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తి తెలిపారు. వివరాలిలా.. గురువారం రాత్రి రెడ్డివారిపల్లె పంచాయతీ ఎర్రాతివారిపల్లె సమీపంలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు తెలిపారు. దాడిలో కె.నరసింహులు, ఎస్.బాలాజీ, ఎస్.రామాంజులు, పి.శ్రీనాథ్, ఎం.భానుప్రసాద్ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.1300 నగదు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

### ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మదనపల్లె సిటీ: స్థానిక ఆర్టీసీ డిపో–2 కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆర్టీసీ సిబ్బంది 165 మందికి డాక్టర్ వెంకటేష్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డీఎం ఆర్సీ నిరంజన్, వివేకానంద ఆశయం ఫౌండేషన్ వ్యవస్థాపకులు భానుప్రకాష్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

### మట్టి రోడ్లకు మోక్షం

కురబలకోట: మండలంలోని వినాయక చేనేత నగర్‌లో ఏళ్లుగా మట్టి రోడ్లు ఉన్నాయి. 60 చేనేత కార్మిక కుటుంబాలు ఇక్కడ ఉన్నాయి. పైగా ఈడూరు గుట్ట ప్రాంతంలో ఉంది. వర్షం పడితే నీళ్లన్నీ ఊరిపై పడతాయి. ఇటీవల ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించారు. స్థానిక సమస్యలను పరిష్కరిస్తానన్నారు. అందులో భాగంగా ఇదివరలో పార్కు మంజూరు చేశారు. హైవే రోడ్డు నుంచి కాలనీలోకి వీధి దీపాల సౌకర్యం కల్పించారు. ఇప్పుడు తొలిసారిగా ఆ ఊరికి రూ. 4 లక్షల పంచాయతీ నిధులతో సిమెంట్ రోడ్డు వేయించారు.

### గట్టులో డీపీఓ తనిఖీలు

బి.కొత్తకోట: మండలంలోని గట్టు పంచాయతీలో జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి తనిఖీలు నిర్వహించారు. డంపింగ్‌యార్డును పరిశీలించి చెత్తనుంచి సంపద తయారీపై దృష్టి సారించాలని, తడి, పొడి చెత్తను వేరు చేయాలని కార్యదర్శులను సూచించారు.

# అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు

- డ్వాక్రా మహిళలకు రూ.10.22 కోట్లు పంపిణీ
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వైఎస్సార్ ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: అక్కచెల్లెమ్మల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపాలనే లక్ష్యంతో వైఎస్సార్ ఆసరా పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సంకల్పయాత్రలో ఆడపడుచులకు ఇచ్చిన హామీ మేరకు బ్యాంక్ రుణాన్ని నాలుగు విడతలు అమలు చేస్తున్నారన్నారు. మొదటి, రెండు విడతలు ఇప్పటికే ఆడపడుచుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు గుర్తు చేశారు. మూడో విడతగా మండలంలోని 940 సంఘాలకు సంబంధించిన 9412 మంది డ్వాక్రా మహిళలకు రూ.10.22 కోట్లు అందజేస్తున్నామని వివరించారు. సంక్షేమ ఫలాల లబ్ధిని మహిళల ఖాతాల్లో నేరుగా జమ చేసి అవినీతికి అవకాశం లేకుండా పారదర్శకంగా పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి డ్వాక్రా మహిళలు గుర్తు పెట్టుకోవాలన్నారు. వైఎస్సార్ ఆసరా పథకాన్ని రాష్ట్రమంతా అమలు చేయడంతో మహిళలంతా పండుగ చేసుకుంటున్నారన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలతో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీపీఎం లక్ష్మీప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, ఏరియా కోఆర్డినేటర్ రూతు, ఏపీఎం నరసింహులు, జెడ్పీటీసీ నిర్మల, వైస్ ఎంపీపీలు వెంకట్రమణ, కిరణ్ కుమార్, సింగల్ విండో అధ్యక్షులు రామక్రిష్ణా రెడ్డి, నాయకులు చింతల ఆనంద రెడ్డి, చింతల శివానంద రెడ్డి, కేశవ రెడ్డి, నల్లంకి నరసింహులు, అబ్దుల్ కలీం, నరసింహులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

**మాట నిలబెట్టుకున్న వైఎస్ జగన్**

వాల్మీకిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చింతపర్తి ఇందిరమ్మకాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

### ప్రతి సమస్యకు పరిష్కారం



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కలకడ : ప్రతి సమస్యకు పరిష్కారం చూపడం బాధ్యత అని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కలకడ మండలం కె.బాటవారిపల్లె పంచాయతీ ఆంజనేయవడ్డిపల్లె, కొత్తగాండ్లపల్లె, గరడప్పగారిపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. కొత్తగాండ్లపల్లె, గరడప్పగారిపల్లె గ్రామాకు కలకడ టౌన్ కిలో మీటరు దూరం మాత్రం ఉండటంతో 24 గంటల టౌన్‌ఫీడర్ విద్యుత్ సరఫరా కావాలని కోరారు. టీడీపీ ప్రభుత్వంలో ఇంటి బిల్లు కేవలం రూ.1 మాత్రమే మంజూరు చేశారని అనేక అప్పులు చేపి ఇల్లు నిర్మించుకున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి గతప్రభుత్వంలో ఇల్లు నిర్మించుకున్న వారికి కూడా బిల్లులు మంజూరు చేసే విధంగా చూస్తానన్నారు. కొత్త గాండ్లపల్లెలో ఇంటిపై ప్రమాదకరంగా చింతచెట్లు ఉన్నట్లు బాధితులు తెలియజేయగా వెంటనే కటింగ్ ఆర్డర్ మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, సింగిల్‌విండో అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, కలిరికి మార్కెట్ కమిటీ చెర్మన్ రవికుమార్‌రెడ్డి, మోహన్‌రాజ్, ఇనాయతుల్లా, జివి కిషోర్, షావత్‌అలీఖాన్, సురేష్‌నాయక్, జయప్రకాష్, బాబురెడ్డి, భీమయ్య, బాబు, జిలానీ, ఖరీముల్లా, సుల్తానీ బాషా, భాస్కర్, ప్రకాష్‌రెడ్డి, కుమార్‌నాయుడు, కుమార్‌రెడ్డి, సర్పంచ్ రామచంద్ర, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.50 కోట్లకు పరిపాలన అనుమతులు

- కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఏకగ్రీవ ఆమోదం
- 30వవార్డులో రూ.51లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణం



సమస్యలను వివరిస్తున్న వైస్‌చైర్మన్ జింకాచలపతి

మదనపల్లె : మున్సిపాలిటీ 2023–24 సంవత్సరపు బడ్జెట్ అంచనాలలో ఇంజినీరింగ్, పరిపాలన, ప్రజారోగ్యశాఖ విభాగంలో వివిధ అంశాలకు సంబంధించి రూ.50 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరుచేస్తూ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజెండాలోని 29 అంశాలు, అత్యవసర సమావేశంలోని 1 అంశం కలిపి మొత్తం 30 అంశాలను సభ్యులకు చదివి వినిపించగా అన్నింటికీ ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్నివార్డుల్లో కౌన్సిలర్లు పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలోని పారిశుధ్య స్థితిగతులు మెరుగుపరిచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ..మున్సిపాలిటీలో వైఎస్సార్ సీపీ కౌన్సిల్ అధికారం చేపట్టినప్పటి నుంచి పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో కౌన్సిల్‌లో పారిశుధ్య కార్మికుల సంక్షేమం పేరుతో నిధులను కేటాయించి, తర్వాత అక్రమంగా పాలకపక్షం స్వాహా చేస్తుండేదన్నారు. ప్రస్తుతం వారందరికీ యూనిఫాం, సబ్బులు, కొబ్బరినూనె, ఇతర వసతులన్నీ సమకూరుతున్నాయన్నారు. 6వవార్డు కౌన్సిలర్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ..30వవార్డులో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి రూ.51లక్షలు మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి కాకుండా స్పెషల్ గ్రాంట్ నుంచి ఖర్చుచేసి ఉంటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. 22వవార్డు కౌన్సిలర్ ముబీనా మాట్లాడుతూ.. సంతగేటులో వ్యాపారులు వదిలిపెట్టిన వ్యర్థాలను శుభ్రం చేసేందుకు పారిశుధ్యకార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గేటు వసూలుచేస్తున్న కాంట్రాక్టర్లకు మార్కెట్‌ను శుభ్రంగా ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 30వవార్డు మొదటి క్రాస్‌లో చాలాకాలంగా ఉన్నటువంటి మురుగునీటి కాలువ సమస్యను పరిష్కరించేందుకు రూ.51లక్షలతో పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలపడంపై కౌన్సిలర్ సరిత హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో కమిషనర్ ప్రమీల, డీఈ బండపల్లిశిరీషా, ఏఈ స్నేహప్రియ, 35వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

# చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

– మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి



చలివేంద్రం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు రూరల్ : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్రాస్ రోడ్డు, పంచాయతీ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్, కొండారెడ్డిక్రాస్ ప్రాంతాల్లో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా ఆధ్వర్యంలో చలివేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రోజులు మంచినీరు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఆనంద్, వార్డు మెంబర్లు ఉదయ్‌కుమార్, సాంబశివారెడ్డి, కాలనీ చిన్న, నాగభూషణం, మల్లికార్జునరెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, పెద్దోడు, షాకీర్, మసూద్, హబీబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# బాలికల సదనంలో విజిలెన్స్ తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మదనపల్లె: పట్టణంలోని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న శిశు సంక్షేమశాఖ బాలికల సదనం, వెలుగు వృద్ధాశ్రమాల్లో వేర్వేరుగా విజిలెన్స్ తనిఖీలు జరిగాయి. శుక్రవారం విజిలెన్స్ సీఐ ఇదురు భాషా ఆధ్వర్యంలో రెండు బృందాలు తనిఖీ నిర్వహించారు. బాలిక సదన్ పరిసరాలను, బాలికల గదులు, కిచెన్, తరగతి గదులను పరిశీలించారు. అక్కడ అందుతున్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సీఐ ఇదురుబాషా మాట్లాడుతూ విజిలెన్స్ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు బాలికల సదన్, వెలుగు వృద్ధాశ్రమాల్లో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. తనిఖీల్లో గుర్తించిన అంశాలు, వివరాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. బాలికల సదదనంలో 42 మంది విద్యార్థులు, వెలుగు ఆశ్రమంలో 52 మంది ఆశ్రయం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఓ బాలగంగాధర్‌రెడ్డి, అసిస్టెంట్ జియాలజిస్టు జి.శ్రీనివాసులు,విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.జనార్దనరావు, సీనియర్ అసిస్టెంట్ రమేష్, నాయక్ తదితరులు ఉన్నారు.

### వాహనాల వేలంతో ఆదాయం

ములకలచెరువు: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన ద్విచక్రవాహనాలకు శుక్రవారం ఎస్ఈబీ అధికారులు వేలం నిర్వహించారు. 08 వాహనాలకు వేలం నిర్వహించగా రూ. 1.18 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక వివరించారు.

### రెండు గుత్తలకే రూ.16.59 లక్షలు

బి.కొత్తకోట: సిండికేటా..పోటాపోటీనా శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనం గుత్తల వేలంలో ప్రభావం చూపింది. బి.కొత్తకోట నగర పంచాయతీకి చెందిన గుత్తలను ఏడాదికి ప్రైవేట్‌కు అప్పగించేందుకు కమిషనర్ పలసాని నరసింహప్రసాద్ వేలం నిర్వహించారు. వారపుసంత, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్ నుంచి రుసుము వసూలు చేసుకునేందుకు వేలం పాట పాడారు. వారపు సంతను రూ.15,12,760కు ఇమ్రాన్ దక్కించుకున్నాడు. దినసరి మార్కెట్ వేలం రూ.1,46,320 పలికింది. ఈ రెండింటికి రూ.7,51,080 ఆదాయం రావడం రికార్డు. కాగా ఈ వేలంలో ప్రైవేట్ బస్టాండ్‌కు పాటదారులు హాజరుకాలేదు.

### సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

పెద్దమండ్యం: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ శ్రీధర్‌రావు సమీక్షించారు. ఆయుష్మాన్ భారత్ సర్వే, ఎస్‌డిజి సర్వే వందశాతం పూర్తి చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీలలో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయడంపై కార్యదర్శులను అభినందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ ఆసరా చెక్కులను స్వయం సహాయక సంఘాలకు పంపిణీ చేస్తారని తెలిపారు.

### కనుల పండువగా కల్యాణోత్సవం

మదనపల్లె సిటీ: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక సొసైటీ కాలనీలోని రామాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ ఎదుట ఏర్పాటు చేసిన వేదికపై సీతారాముల కల్యాణాన్ని వేద పండితులు వేదమంత్రోచ్చరణతో జరిపించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో కల్యాణం తిలకించారు.

# ప్రజలకు రూ.1.40 కోట్ల భారం తప్పించాం

– కమిషనర్ పలసాని నరసింహప్రసాద్

బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీ ప్రజలపై ఉన్న రూ.1.40 కోట్ల పన్నుల భారాన్ని తప్పించామని కమిషనర్ పలసాని నరసింహప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన నగర పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి, సమస్యలపై సమీక్ష నిర్వహించారు. తర్వాత పేదలకు ఇళ్ల నిర్మాణాల ప్రగతి, కొత్తగా ఇళ్ల నిర్మాణాల మంజూరుకు సంబంధించిన ప్రతిపాదనలపై హౌసింగ్ డీఈ శ్రీహరిరావుతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆఫ్‌లైన్‌లో ప్రజలు చెల్లించిన పన్నుల సొమ్ము ఆన్‌లైన్ చేయకపోవడంతో పెండింగ్ చూపుతూ, కొత్త పన్నులు అందులో కలిసిపోయాని, వాటిపై వడ్డీ భారం కూడా పడిందని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషితో ప్రజలకు ఊరట లభించిందని చెప్పారు.

**ఒకేరోజు రూ.6 లక్షల వసూళ్లు**

బి.కొత్తకోట నగర పంచాయతీ ప్రజలు ఇంటిపన్నుల చెల్లించేందుకు శుక్రవారం క్యూ కట్టారు. ప్రజలు పన్నులు చెల్లించకుండా బకాయి పడటంతో ప్రభుత్వం రాయి తీ ప్రకటించింది. మార్చి 31నాటికి చెల్లించే బకాయిలపై నాలుగు శాతం రాయితీ ఇవ్వడంతో ప్రజలు రాత్రి 8.30 గంటల దాక పన్నుల చెల్లిస్తూనే ఉన్నారు. అప్పటి వరకు రూ.6 లక్షలు వసూలైంది. రాత్రి 12 గంటల వరకు ప్రజలు పన్నులు కట్టించుకునేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని మేనేజర్ రమాదేవి తెలిపారు.

# చిరుధాన్యాలు పోషకాల గనులు



మిల్లెట్ మహోత్సవంలో రుచులు చూస్తున్న నాయకులు, అధికారులు

కురబలకోట: చిరు ధాన్యాలు ఆరోగ్య సిరులే కాకుండా పోషకాల గనులని రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ మానిటరింగ్ కమిషన్, విద్యా కమిటీ సభ్యులు బి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. కురబలకోట వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఎల్ఎం ద్వారా శుక్రవారం మిల్లెట్ మహోత్సవం నిర్వహించారు. చిరుధాన్యాలతో చేసిన వివిధ ఆహార పదార్థాలు, వంటల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల ఆహారం తీసుకొని రోగాలను తరిమికొట్టాలన్నారు. అంతకు ముందు మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోందన్నారు. ఈసాగుకు పెద్దగా ఖర్చు కూడా లేదన్నారు. రసాయనిక ఎరువులు అవసరమే లేదన్నారు. ఎంపీపీ బి. దస్తగిరి మాట్లాడుతూ చిరుధాన్యాల వాడకంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు.

# వైభవంగా చెన్నకేశవ స్వామి రథోత్సవం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూచిపల్లిలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో మూడు రోజులు పలు పూజలు, అభిషేకాలు, కళ్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, వేద పారాయణ, స్తోత్ర పారాయణం, అభిషేకం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వేద పండితులు స్వామి వారి ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవింద నామ స్మరణలతో రథాన్ని ముందుకు లాగారు.

**పుష్పపల్లకీలో సీతారాముల ఊరేగింపు**

పీలేరు : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రకాశం రోడ్డులోని శ్రీ కోదండరామస్వామి ఆలయం నుంచి పుష్పపల్లకీలో సీతారాముల ఊరేగింపు అంగరంగవైభంగా నిర్వహించారు. శుక్రవారం సీతారాముల ఉత్సవ విగ్రహాలను పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం మంగళ వాయిద్యాలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో స్థానిక ఎంపీపీడీఓ కార్యాలయం నుంచి తిమ్మారెడ్డి, అజంతామిట్ట, ఎల్‌బీఎస్ రోడ్డు, క్రాస్ రోడ్డు, తిరుపతి రోడ్డు వరకు స్వామి వారిని ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

# ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన

మదనపల్లె : ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు అన్నారు. పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవం (సివిల్ రైట్స్ డే)ను పురస్కరించుకుని మాలేపాడు ఎస్సీ కాలనీలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. నిమ్మజాతుల వారిని కించపరిచినట్లు మాట్లాడితే చట్టప్రకారం శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. ప్రతినెలా చివరిరోజున గ్రామాల్లో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మాలేపాడు–కొత్తూరు దారిసమస్యపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.గణేష్, ఎంపీటీసీ సీ.ఆర్.ఈశ్వరమ్మ, ఈఓఆర్డీ వెంకటసుబ్బయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీషా, ఏపీఓ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.